మొదలైన చదువుల సందడి

- దాదాపు 50 రోజుల అనంతరం తెరుచుకున్న పాఠశాలలు
- వడివడిగా బడివైపు విద్యార్థుల అడుగులు
- తొలిరోజు హాజరు అంతంత మాత్రమే



పాఠశాల వైపు వడివడిగా అడుగులు వేస్తున్న విద్యార్థులు



ఉపాధ్యాయులు చెబుతున్న విషయాలను ఆసక్తిగా వింటున్న విద్యార్థులు

రాజంపేట టౌన్ : పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో చిన్నారులు ఆటపాటలతో సందడి చేసిన క్రీడా మైదానాలు, వీధులు ఒక్కసారిగా బోసిపోయాయి. ఇళ్లల్లో చిన్నారులు చేసే అల్లరి, గోల మూగబోయింది. తొలిరోజు పాఠశాలకు బయలుదేరిన అనేక మంది పిల్లలు తమ తల్లిదండ్రులకు బై మా, బై నానా అంటూ బ్యాగు తీసుకొని పాఠశాలల వైపు అడుగులు వేశారు. కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాల వద్ద డ్రాప్ చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు బాగా చదువుకో నానా అంటూ పాఠశాలలోకి పంపారు. ఇదిలావుంటే చిన్న తరగతులకు సంబంధించిన కొంత మంది విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు మారాం చేయగా పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వారిని బుజ్జగిస్తూ పాఠశాలకు తీసుకెళ్లగా, మరికొంత మంది తల్లిదండ్రులు బలవంతంగా పాఠశాలకు తీసుకెళ్లారు. ఉపాధ్యాయులు హాజరు వేయగా ×ప్రజెంట్ సార్ అని పలికారు. ఏది ఏమైనా తొలిరోజు పాఠశాలల్లో సరికొత్త కళ కనిపించింది. అయితే ఇటు ప్రభుత్వ అటు ప్రైవేట్ పాఠశాలల్లో హాజరు శాతం అంతంత మాత్రమే నమోదైంది.

యోగ క్షేమాలు.. హిత బోధలు

దాదాపు యాభై రోజుల తరువాత విద్యార్థులు పాఠశాలలకు రావడంతో ఉపాధ్యాయులు తొలుత విద్యార్థుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పలువురు ఉపాధ్యాయులు కుశల ప్రశ్నలు వేస్తూ కాస్త సరదాగా గడిపారు. వేసవి సెలవులను ఎలా గడిపారు, ఎక్కడెక్కడికి వెళ్లారు, టూర్‌లకు వెళ్లివుంటే అక్కడి విశేషాలేమిటి అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. టెన్త్ విద్యార్థులకు మాత్రం ఉపాధ్యాయులు హితబోధనలు చేశారు.

సమయాన్ని వృథా చేసుకోకుండా గడిపితేనే టెన్త్‌లో అత్యుత్తమ మార్కులు సాధించగలరని సూచించారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించేందుకు ఈ రోజు నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలిపారు.

స్నేహితుల్లో ఆనందం

చాలా రోజుల తరువాత కలుసుకోవడంతో అనేక మందిలో స్నేహితులను కలుసుకున్నామన్న ఆనందం కనిపించింది. విరామ సమయంలో స్నేహితులు ఒక చోట కూర్చొని సెలవుల్లో గడిపిన విషయాలను సరదాగా చెప్పుకుంటూ కనిపించారు. చాలా రోజుల తరువాత పాఠశాల ఒడిలో స్నేహితులు కలవడంతో వారిలో ఆనందం తొణికిసలాడింది.

ఇక చదువుపైనే దృష్టి



వేసవి సెలవుల్లో కుటుంబ సభ్యులు, బంధువులతో ఆనందంగా గడిపాను. తోటి మిత్రులను కలుసుకోవడం సంతోషం. వచ్చే ఏడాది జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో పాస్ కావాలన్నదే ఇప్పుడు నా ముందున్న లక్ష్యం. అందువల్ల టెన్త్ పరీక్షలు ముగిసే వరకు చదువుపైనే దృష్టిసారిస్తా. తప్పకుండా టాప్ మార్క్ తెచ్చుకొని పేరెంట్స్‌కి, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకొస్తా.

– తహని, టెన్త్ విద్యార్థిని, ప్రభుత్వ హైస్కూల్, రాజంపేట

వెరీ హ్యాపీ



వేసవి సెలవులు కావడంతో దాదాపు యాభై రోజుల పాటు స్నేహితులందరం ఒకేచోట కలవలేక పోయాం. చాలా రోజుల తరువాత క్లాస్‌మేట్స్‌ని, ఫ్రెండ్స్‌ని కలుసుకున్నా. ఐయామ్ రియల్లీ హ్యాపీ. టెన్త్‌లో నాతోపాటు నా ఫ్రెండ్స్ అందరు పాస్ అయ్యి మేమంతా ఒకే కాలేజీలో చేరాలన్నదే నా ఆశ. ఇక ఆటలు, సరదాలను పక్కన పెట్టి సమయం వృథా చేయకుండా మేమంతా బాగా చదువుకుంటాము.

– పవన్, టెన్త్ విద్యార్థి, ప్రభుత్వ హైస్కూల్, రాజంపేట

క్లుప్తంగా

నేడు సోలార్ విద్యుత్‌పై అవగాహన

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజుపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఉదయం 10:30 గంటలకు విద్యుత్ వినియోగదారులకు సోలార్ రూఫ్ టాప్‌పై అవగాహన సదస్సు విద్యుత్ వినియోగదారులకు నిర్వహించనున్నట్లు డీఈఈ డాక్టర్ రావు గురువారం తెలిపారు. ప్రతి వినియోగదారులు ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని, సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



యామినీ, తహసీల్దార్

ఓబులవారిపల్లె : మండలంలో రైతుల భూ సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తహసీల్దార్ యామినీ పేర్కొన్నారు. గురువారం మండల తహసీల్దార్‌గా ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశంలో వారు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎర్రగుంట్ల డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి తహసీల్దార్‌గా వచ్చినట్లు తెలిపారు. మండలంలో రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్రీధర్ రావు రాజంపేట ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా బదిలీపై వెళ్లారు.

లక్కిరెడ్డిపల్లి హార్టికల్చర్ అధికారిగా సింధూరి



లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి ఉద్యానశాఖ అధికారిగా సి.సింధూరి గురువారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా కడప నుంచి లక్కిరెడ్డిపల్లికి బదలీ అయినట్లు ఇక్కడ పనిచేస్తున్న ఉద్యానశాఖ అధికారిణి నాగమణి పదోన్నతి పొంది కడపకు వెళ్లినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

గాలివీడు ఎంపీడీఓ బదిలీ

గాలివీడు : తాను బదిలీపై వీరబల్లి మండలానికి వెళుతున్నట్లు గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సీఈఓ ఓబులమ్మ ఉత్తర్వుల మేరకు బదిలీపై వెళుతున్నట్లు స్పష్టం చేశారు. విధి నిర్వహణలో తనకు వెన్నుదన్నుగా నిలుస్తూ ఇన్ని రోజులు సహకారం అందించిన తోటి ఉద్యోగుల సేవలను ఆయన గుర్తుకు చేసుకున్నారు.

ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు



శ్రీకృష్ణకు స్వాగతం పలుకుతున్న టీచర్లు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా శ్రీకృష్ణ బాధ్యతలు చేపట్టారు. గురువారం పాఠశాల ఉపాధ్యాయులు ఆయనకు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు శ్రీకృష్ణ మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన, నాణ్యమైన విద్యను అందించేందుకు అన్నివిధాల కృషి చేస్తామని, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరి, నరసింహారెడ్డి, చెంగా శ్రీనివాసులు, రవికుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పురాతన షెడ్డుకు మరమ్మతులు



నూతన భవనంలో విద్యార్థులు

పుల్లంపేట : మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శిథిలావస్థలో ఉన్న, షెడ్డును కొత్తపేట గ్రామానికి చెందిన కాసల నరసయ్య జ్ఞాపకార్థం ఆయన మనుమడు రూ. 50 వేలు అందజేసి భవనానికి మరమ్మతులు నిర్వహించారు. దీంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రారంభం కావడంతో విద్యార్థులకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని వారు కొనియాడారు. దాతలు ముందుకు వచ్చి ఇలాంటి సహాయ సహకారాలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉర్దూ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర వ్యాప్తంగా ఉర్దూ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందేలా చూడాలని ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆరిఫ్‌ఖాన్, రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్‌బాషా డిమాండ్ చేశారు. నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో విలేకరులతో గురువారం వారు మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలు సకాలంలో అందక, సంబంధంలేని సబ్జెక్టులను ఎలా చదవాలో అర్థంగాక ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రతి విద్యార్థికి వారికి సంబంధించిన సబ్జెక్టులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ఆంజనేయ స్వామి తిరునాల



దేవాలయ ప్రాంగణంలో భక్తుల సందడి

సుండుపల్లె : మండల కేంద్రంలోని తిమ్మసముద్రం గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి తిరునాల గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. తిరునాలలో రంగురంగుల చాందినీబండ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

నివాళి

వీరబల్లి : మండలంలోని మట్లి పంచాయతీలో ఎల్లంపల్లికి చెందిన బండి వెంకటరమణ (46) ఇటీవల ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడ్డాడు. బెంగుళూరులో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మట్లి గ్రామ సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబానికి సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన



చిన్నారులతో మండల విద్యాధికారి పిల్లి నాగరాజు, రెడ్స్ సంస్థ ప్రతినిధులు

గాలివీడు : బాలకార్మిక వ్యవస్థ సమూలంగా నిర్మూలించాలంటే విద్యతోనే సాధ్యమని మండల విద్యాధికారి పిల్లి నాగరాజు పేర్కొన్నారు. గురువారం బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని స్థానిక పక్కిరెడ్డిగారి పల్లెలో రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ కో–ఆర్డినేటర్ శ్రీనువాసులు మాట్లాడుతూ బాల కార్మిక చట్టం ప్రకారం 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం, పనులకు పంపడం చట్టరీత్యా నేరం అన్నారు. జేజే యాక్ట్ ప్రకారం ప్రమాదకర ప్రదేశాలలో 14 నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లలతో పని చేయిస్తే శిక్షార్హులు అవుతారన్నారు. చదువుకోవలసిన బడి ఈడు పిల్లలు బడిలో వుండేలా పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది, ఐఈఆర్పీ ఖలందర్, రెడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



ఆర్‌అండ్‌బీ వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

రాజంపేట రూరల్ : విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు గాలి చంద్ర, జిల్లా కార్యదర్శి ఇ.సికిందర్, ఆటో వర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ వద్ద గురువారం ఏఐటీయూసీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులను అక్రమంగా తొలగిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికే 2500 మందిని తొలగించారన్నారు. వర్క్ టెండర్లను రెన్యూవల్ చేయకుండా మరో 1500 మందిని తీసివేయడాన్ని ఖండించారు. 1200 మంది పర్మినెంట్ కార్మికులను వీఆర్ఎస్ పేరుతో ఇంటికి పంపడాన్ని తప్పుబట్టారు. మరో 3000 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించటానికి జాబితాను సిద్ధం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. తమ ఉద్యోగాలను రక్షించుకోవడం కోసం 12000 మంది కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మె చేయవల్సిన స్థితిని యాజమాన్యం కల్పించిందన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలి



గాలివీడు: మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఏఈ విజయ్ కుమార్



నందలూరు: అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ ఈఈ రాజశేఖర్‌రెడ్డి

గాలివీడు : ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ విజయ్ కుమార్, ఏఈ లక్ష్మయ్య తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బంది, వినియోగదారులకు పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లలో రూఫ్ టాప్ సోలార్ ప్యానల్స్‌ల కెపాసిటీకి సరిపడా ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రభుత్వం వినియోగదారులకు సబ్సిడీ అందజేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి నెలరోజుల వ్యవధిలోనే సబ్సిడీ వచ్చే విధంగా విద్యుత్ శాఖ, సోలార్ డిస్ట్రిబ్యూటర్లు కృషి చేస్తున్నారని తెలిపారు. ఒక కిలో వాట్ నుంచి రెండు కిలో వాట్ల వరకు రూ.30 వేల నుంచి రూ.60 వేలు సబ్సిడీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకుల ద్వారా విద్యుత్ శాఖ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకొని గృహాలకు వినియోగించుకోవడం ద్వారా కరెంట్ బిల్లులు ఆదా చేసుకోవచ్చన్నారు. వినియోగదారులు అదనపులోడును క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.

సోలార్‌తో విద్యుత్ ఆదా

నందలూరు : సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయని ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం అరవపల్లిలోని ఆర్ అండ్ బీ అతిథి గృహం ఆవరణలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ సోలార వల్ల ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఏపీఎస్పీడీసీఎల్ కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. దీని వల్ల వినియోగదారునికి మేలు జరుగుతుందన్నారు. వీటి ఏర్పాటు వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. సబ్సిడీతో సోలార్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో డీఈఈ మురళీధర రెడ్డి, ఏఈ బాలసుబ్రమణ్యం, తహసీల్దార్ అమరేశ్వరి, ప్రజాప్రతినిధులు అక్కిరెడ్డి మోహన్‌రెడ్డి, గీతాల నరసింహారెడ్డి, మోడపోతుల రాము, ప్రజలు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అన్నీ వాయిదాలే



సీహెచ్ చంద్రశేఖర్

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలకు ఏమాత్రం సంతృప్తి కలగలేదని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ చంద్రశేఖర్ గురువారం విమర్శించారు. స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఏడాది పాలనలో అన్నీ వాయిదా వేసుకుంటూ కాలం వెళ్లిబుచ్చారని విమర్శించారు. సూపర్ సిక్స్ వాగ్దానాలు అమలు కాలేదని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు లేదని, నిరుద్యోగ భృతి, ఉపాధి లేదన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించారని విమర్శించారు. 178 వాగ్దానాలు చేస్తే కేవలం 16 మాత్రమే అమలు చేశారని విమర్శించారు. ఇప్పుడు అన్ని అమలు చేసేశాం అని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం ప్రజలను వంచించడమే అని ఎద్దేవా చేశారు. రాబోయే కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పే రోజులు దగ్గర పడ్డాయని తెలియజేశారు.

కనుల పండువగా రథోత్సవం



గ్రామంలో ఊరేగుతున్న వేణుగోపాలస్వామి

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు వేణుగోపాలస్వామి ఆలయంలో రథోత్సవం గురువారం సాయంత్రం కనుల పండువగా జరిగింది. బలిజ సంఘం వారు ఉభయదాతలుగా రథోత్సవాన్ని నిర్వహించారు. వేడుకలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పురవీధులలో వేణుగోపాలస్వామి, రుక్మిణి, సత్యభామలను రథంలో ఊరేగించారు. ప్రతి ఇంటిలోని వారు కాయాకర్పూరం సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. రాత్రికి హరికథ కాలక్షేపం నిర్వహించారు. ఈ రథోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ, సిబ్బంది

వీరబల్లి : వీరబల్లి – రాయచోటి రహదారిలో గురువారం స్థానిక ఎస్ఐ నరసింహారెడ్డి తన సిబ్బందితో కలసి వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనదారులను గుర్తించి వారికి జరిమానా విధించడంతోపాటు కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, అలాగే ఇన్సూరెన్సు, డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలని సూచించారు. ఎవరైనా ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ



మొక్కలు నాటుతున్న టీచర్లు

సంబేపల్లె : మానవాళి మనుగడకు ప్రాణాధారమైన మొక్కలను ప్రతి ఒక్కరూ పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని మోటకట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. మొక్కలు నాటడం వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శయనోత్సవం

కలికిరి: పట్టణంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల అనంతరం లోప దోషాల నివృత్తి నివారణ నిమిత్తం ఆనవాయితీ ప్రకారం స్వామి, అమ్మవార్లకు గురువారం పుష్పయాగం, శయనోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో గోవింద నామస్మరణ మధ్య స్వామివారికి పుష్పయాగం చేశారు. ఆలయ అర్చకులు మురళీధరాచార్యులు, శ్రీకాంతాచార్యులు, రాముస్వామి పాల్గొన్నారు.

ఇష్టంతో కష్టపడి చదవాలి



ఫినిహాస్‌ను సత్కరిస్తున్న హెచ్‌ఎం భారతి

రాజంపేట టౌన్ : ప్రతి విద్యార్థి ఇష్టంతో కష్టపడి చదివి టెన్త్‌లో అత్యుత్తమ మార్కులు సాధించి షైనింగ్ స్టార్‌కు ఎంపిక కావాలని బోయినపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భారతి ఆకాంక్షించారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో బోయినపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఫినిహాస్ 591 మార్కులు సాధించి షైనింగ్ స్టార్ అవార్డును పొందారు. ఈ సందర్భంగా గురువారం ఫినిహాస్‌ను పాఠశాల హెచ్‌ఎం భారతి మెమెంటోతో సత్కరించి మాట్లాడారు. ఫినిహాస్ ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మండల టాపర్‌గా కూడా నిలవడం తమ పాఠశాలకు ఎంతో గర్వకారణమన్నారు. ఉపాధ్యాయుల కృషి ఫలితంగా ఈ ఏడాది తమ పాఠశాల మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు ఫినిహాస్‌ను స్ఫూర్తిగా తీసుకొని చదవాలని సూచించారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. అందువల్ల ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. వచ్చే ఏడాది జరిగే టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో కూడా అత్యుత్తమ మార్కులు సాధించేందుకు ఇప్పటి నుంచే ఒక ప్రణాళికాబద్ధంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి చిన్నరెడ్డి సేవలు మరువలేనివి



రాజంపేట రూరల్: అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా



రాజంపేట రూరల్: చిన్నరెడ్డికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ



ఓబులవారిపల్లె: నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తదితరులు

రాజంపేట రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి (ఓబుళం లక్ష్మీకర్‌రెడ్డి) చిన్నరెడ్డి చేసిన సేవలు మరువలేనివని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.అంజద్‌బాషా కొనియాడారు. మండల పరిధిలోని రేణింతల గ్రామంలో గురువారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ ఓబుళం లక్ష్మీకర్‌రెడ్డి (ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి మేనమామ) అంత్యక్రియలు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. చిన్నరెడ్డి భౌతికకాయానికి మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యేలు కొండూరు ప్రభావతమ్మ, కొరముట్ల శ్రీనివాసులు, కడప మేయర్ కె.సురేష్‌బాబు, ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడులతో పాటు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చిన్నరెడ్డికి నివాళులర్పించారు. చిన్నరెడ్డి ఆకస్మిక మృతితో మండలంలో విషాదచాయలు అలుముకున్నాయి. అంత్యక్రియల్లో బంధుమిత్రులు, సన్నిహితులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సాగు వ్యయం తగ్గించడమే లక్ష్యం



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

గాలివీడు : పంటల సాగు వ్యయాన్ని తగ్గించి, నూతన ఆవిష్కరణలపై రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం అన్నమయ్య జిల్లా వారి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నూలివీడు, పూలుకుంట గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన భారత నూనె గింజల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సురేష్, డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా శాస్త్రవేత్తలు ప్రత్యేకంగా రైతులతో సంభాషించి ఖరీఫ్ సమయంలో అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. శాస్త్రీయ బృందాల భాగస్వామ్యంతో సాగులో నూతన, సాంకేతికతపై అవగాహన కల్పించమన్నారు. అంతేగాక భూసార పరీక్షల ప్రాముఖ్యత, యజమాన్య పద్ధతులు, వేరుశనగలో రకాలు, పోషక యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వ పథకాలు తదితర అంశాలను క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ బేబీ, రాణా ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా



శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాల ముఖద్వారం

రాయచోటి టౌన్ : రాయచోటిలోని శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అటానమస్ హోదా కల్పించినట్టు ఆ కళాశాల చైర్మన్ కేపీపీ సుబ్బయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించడంతో పాటు పరిశోధన అభివృద్ధి, విద్యార్థుల శ్రేయస్సుపై నిరంతర కృషి చేయడం వలన ఈ హోదా లభించిందన్నారు. కళాశాలకు ఇప్పటికే ఎన్ఏఏసీ ఏ+ గ్రేడ్ వచ్చిందన్నారు. దీని ద్వారా నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఈ అటానమస్ హోదా ఈ ఏడాది 2025 – 2026 సంవత్సరం నుంచే అమల్లోకి రానున్నదని చెప్పారు. ఈ హోదా రావడం వలన సిలబస్ రూపొందించడం, పరీక్షల నిర్వహణ, ఫలితాల నిర్వహణ, ఫలితాల ప్రకటన, సిలబస్‌ను దృష్టిలో ఉంచుకొని ఇండస్ట్రీ ఓరియంటెడ్ కోర్సులు, నూతన కోర్సులు, పరిశోధనాధారిత విద్యా విధానాలను అమల్లోకి తెచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈసందర్భంగా కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్, ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులతో కలసి సంబరాలు నిర్వహించుకున్నారు.